
# నటనాలయం

## పెయ్యేటి శ్రీదేవి



పెళ్లి పీటల మీద కూర్చున్నారు వధూవరులిద్దరు. మధ్య మధ్యలో బిజీగా సెల్‌ఫోన్లో మాట్లాడుతూ పెళ్లి మంత్రాలు చదువుతున్నాడు పురోహితుడు. వచ్చిన అతిథులు పెళ్లి తంతుని దీక్షగా చూస్తున్నారు. ఆడవాళ్లు పట్టుచీరలు, నగలు ధరించి హడావిడిగా ఇటు అటూ తిరుగుతున్నారు.

'మాంగల్యం తంతునా నేన
మమజీవన హేతునా
కంఠే భధ్నామి సుభగే
త్వం జీవ శరదాం శతమ్
మాంగల్య ధారణ ముహూర్త స్సుముహూర్తోస్తు!'

వధువు మెడలో మూడు ముళ్లు వేశాడు వరుడు. వధూవరుల మీద అందరూ అక్షతలు జల్లారు. పెళ్లి కూతురు తల్లీ, అన్న కూడా అక్షతలు జల్లుతుంటే పెళ్లికూతురు అన్న వైపు క్రూరంగా చూసింది. తరువాత స్వప్న అత్తగారు పెళ్లికూతురు దగ్గరకొచ్చి, 'అమ్మా, స్వప్నా! నా కోడలి మెడలో తరతరాలుగా వస్తున్న ఈ చంద్రహారం వెయ్యాలని ఎన్నాళ్ల నించో అనుకుంటున్నామ్మా. ఇన్నేళ్లకి ఆ కోరిక తీరింది' అంటూ రాళ్ల లాకెట్టుతో వున్న అయిదు పేటల చంద్రహారం వెయ్యబోతుంటే పెళ్లికూతురు అత్తగారిని గట్టిగా వాటేసుకొని, ''ఆంటీ! మీరే కదూ, 'ఆనంద్' సినిమాలో రాహుల్ తల్లిగా నటించారు? అబ్బా! మీ నటన సూపరుందాంటీ! నేను అప్పట్నించీ మీ ఫేన్‌నైపోయానంటే నమ్మండి. అసలు మిమ్మల్ని చూస్తానని కలలో కూడా అనుకోలేదు. 'ఆనంద్'లో హీరోయిన్ వాళ్లమ్మ చీర సెంటిమెంట్‌గా కట్టుకుందామనుకుంటే మీరు వల్లకాదు, నే చెప్పినట్లు వినాలన్నారు. ఇప్పుడు తరతరాల సెంటిమెంటు పెట్టి ఈ అయిదు పేటల చంద్రహారం నా మెడలో వేస్తున్నారు.''

''కట్..... కట్..... కట్..... కట్......! ఏమ్మా, ఏంటి? ఓ మూల సినిమా షూటింగ్ జరుగుతుంటే, యాక్షన్ చేయకుండా ఏవేవో మాట్లాడేస్తున్నావు? ఆమె మీద అభిమానం వుంటే పేకప్ చెప్పాక నీ ప్రేమనంతా కురిపించుకో. ఇందాకేమో నీ అన్నగా వేస్తున్న హీరో నీ మీద అక్షతలు జల్లుతుంటే బాధగా ఏంటలా చూస్తున్నావు? యాక్షన్ అన్నప్పుడు మేం చెప్పినట్టే చెయ్యాలి.

కథ



కట్ అన్నప్పుడు మామూల స్థితిలోకి రావాలి. ఛా! కొత్తోళ్లతో సినిమా తీస్తే ఇలాగే ఏడుస్తుంది, చెప్పలేక చావాలి. వాళ్లకి అర్థమై చావదు. నువ్వు చేసిన దానికి ఎంత టైము వేస్టో..ఎంత రీలు వేస్టో! ఈ పెళ్లి సెట్‌కి ఎంత డబ్బు ఖర్చో తెలుసా?'' అంటూ నిర్మాత కోపంగా వెళ్లిపోయాడు.

ఈ అనుకోని సంఘటనకి మిగతా ఆర్టిస్టులు, టెక్నీషియన్సు కూడా తెల్లబోయారు. నిర్మాత, డైరక్టరు తిట్టేసరికి ఏడుపు లంకించుకుంది విశాలి.

''ఏమయ్యా, అసిస్టెంటు డైరక్టరూ! ఇలాంటివన్నీ నువ్వు చూసుకోవాలి. నువ్వూ కొత్తోడివేనా? అమ్మా, రాగసుధగారూ! ఆ అమ్మాయికి ఊరడించి ధైర్యం చెప్పండి. కాస్త రిలాక్సవమ్మా. తరువాత మేం ఎలా చెబితే అలా చెయ్యి. అంతేగానీ షూటింగ్ టైములో నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకు. ఎందుకలా డల్‌గా వున్నావు. ఏదో పోగొట్టుకుంటున్నట్లు? ఇష్టపడే వచ్చావుగా ఈ ఫీల్డ్‌లోకి? హ్యాపీగా వుండు. హీరోగారేరి? ఆ... మోహన్ గారూ! మీరుండండి. మీమీద, హీరోయిన్ షకీలా మీద చిన్న షాట్ తియ్యాలి!''

సౌమ్య క్యారక్టర్‌కి తల్లిగా వేసిన రాగసుధ విశాలిని సముదాయించింది.

''ఎందుకమ్మా అలా వున్నావు? ఈ మాత్రానికే ఇలా డీలా పడిపోతే ఎలా? నటీనటుల నుంచి యాక్షన్ రాబట్టుకోడానికే వాళ్లు తిడతారు, కేకలేస్తారు. వాళ్లు టీచర్ లాంటి వాళ్లు. అవన్నీ సీరియస్‌గా తీసుకోకు. కొత్తలో అందరూ ఇలాగే చేస్తారు. ఇదిగో, కళ్లు తుడుచుకొని ముందర ఈ మంచినీళ్లు తాగు'' అని రాగసుధ మంచినీళ్లు తాగించింది సౌమ్య క్యారక్టర్ చేస్తున్న విశాలికి.

విశాలి మంచినీళ్లు తాగి అంది. ''సరేనండి... ఇంక సరిగా చేస్తాను.''

రాగసుధ అడిగింది. ''ఇప్పుడు చెప్పు నీ బాధేమిటో. అసలు నేనూ, మోహన్ అక్షతలు జల్లుతుంటే ఎందుకంత కోపంగా చూసావు?''

''ఆంటీ! ఈ సినిమాలో హీరో మోహన్, నేను రెండేళ్ల నుంచీ ప్రేమించుకుంటున్నాం. ఇద్దరం కాలేజీలో చదువుతూ, 'ఎల్' ఛానల్ వాళ్లు నిర్వహించిన 'స్టార్ హంట్'లో పాల్గొని గెలిచాం. ఇక మా ఆనందానికి హద్దులు లేవు. హాయిగా ఇద్దరం హీరో, హీరోయిన్ వేషాలేస్తూ, ఆస్ట్రేలియా, సింగపూర్, బ్యాంకాక్‌లలో పాటల షూటింగ్‌లకి వెళ్లి జాలీగా గడిపేయొచ్చును కున్నాం. కానీ నేను ఎంతో గాఢంగా ప్రేమించిన నా లవ్వర్‌తో చెల్లెలు వేషాలు వేయాల్సి వొస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఎంత బాగా నటించాలన్నా నా మనసు సహకరించడంలేదాంటీ. డైరక్టరుగారేమో మాటి మాటికీ నా మీద కసురుకుంటున్నారు. ఇంక నే బతకలేనాంటీ! నాకు చచ్చిపోవాలనుంది'' అంటూ భోరున ఏడ్చేసింది విశాలి సీనియర్ ఆర్టిస్ట్ రాగసుధ ఒడిలో తలవాల్చి.


''అమ్మా విశాలీ! ఛీ! ఈ మాత్రానికే ఆత్మహత్య చేసుకుంటావా? అసలు నువ్వింతగా బాధపడాల్సిన పెద్ద సమస్యేమీ కాదు.''

''మీకు తెలీదాంటీ, నే పడే బాధ! ఎంత చెప్పినా మీ కర్థం కాదు.''

''ఇదిగో విశాలీ! ముందు నే చెప్పేది సావధానంగా విను. తరువాత ఆత్మహత్య చేసుకుంటావో, దేవుడిచ్చిన జన్మని సార్థకం చేసుకుంటావో నీ ఇష్టం. అసలు ముందు నీ బాధేమిటంటే, నీవు ప్రేమించిన అబ్బాయితో చెల్లెలి వేషాలు వేయాల్సి రావడం... !సినిమా అనేది కేవలం నటన! తెరపై చేసే నీ నటనే జనం ఆనందంగా చూస్తారు. తెర వెనుక నీ గురించి పట్టించుకోరు. నటీనటులన్నాక అన్ని పాత్రలు వేయాలి. చెల్లెలి పాత్రకొకరు, భార్య పాత్రకొకరు, కృష్ణుడి పాత్రకొకరు అని కేటాయింపుగా ఎవరూ వుండరు. ఉన్న నటీనటులకే డైరెక్టరు తగిన పాత్రలు ఇస్తారు. ఎన్నో రకాల పాత్రలు అద్భుతంగా నటించారు కాబట్టే, ఆ నాటి వారు మహానటీమణులయ్యారు. ఎంతో మంది చెల్లెలు వేషాలు వేసారు. తల్లి వేషాలు వేసారు. ప్రియురాలి వేషాలు వేసారు. నాగేశ్వరరావుగారి కన్నా పెద్దదయిన శాంతకుమారిగారు ఒక చిత్రంలో ఆయనకు భార్యగానూ వేసారు. మరో చిత్రంలో తల్లిగానూ వేసారు. 'రక్తసంబంధం' చిత్రంలో మహానటి సావిత్రిగారు ఎన్టీఆర్ గారికి చెల్లెలుగా వేసి జనం మెప్పు పొందారు. మరో చిత్రంలో ఆ ఎన్టీఆర్‌గారికే భార్యగానూ నటించారు. అత్తగారుగా ప్రఖ్యాతి పొందిన సూర్యకాంతమ్మగారు గుమ్మడిగారికి భార్యగానూ, 'భార్యాభర్తలు' సినిమాలో కూతురిగా నటించారు. వాణిశ్రీ గారు మొట్టమొదట వింజామరలు విసిరే వేషాలు వేసి, ఆ తరువాత చెలికత్తెగా వేసి అటుపిమ్మట అవి మానేసి పెద్ద స్టారైపోయారు. ప్రపంచసుందరి ఐశ్వర్యా రాయ్ అమితాబ్ పక్కన 'కజారే' డాన్సు చేసింది. తరువాత ఆయనకు కోడలూ అయింది.

ప్రముఖ నటి శ్రీదేవి అనిల్‌కపూర్‌తో నటించి, నిజ జీవితంలో ఆయనకి వదినయింది. సినిమా అంటే కేవలం నటనకి సంబంధించినదే. నటన అంటే అది నీకు జాబ్‌లాంటిది. అది నీ వృత్తి. నీ వృత్తికి నీవు న్యాయం చేకూర్చాలి. అంతేగానీ అదే నీ ప్రవృత్తి కాకూడదు. అంటే నువ్వు వేసే పాత్రల ప్రభావం నీ జీవితం మీద పడకూడదు. జీవితం వేరు. నటన వేరు. నటనలో జీవించు. రాణిస్తావు. కానీ జీవితంలో నటించకు అవతలి వాళ్లు దెబ్బతింటారు.

దేవాలయానికి వెడితే భక్తిగా దేవునికి నమస్కరిస్తున్నప్పుడు ఏ ఆలోచన వుండదు. అక్కడ మనసు పవిత్రంగా వుంటుంది. అందుకే అది దేవాలయం. నటన కూడా వేరే ఆలోచనలు లేకుండా చాలా ఏకాగ్రతతో చేయాలి. కళలు దైవదత్తం. అందుకే ఇది కూడా కళామతల్లి ఆలయం... నటనాలయం. నువ్వు ఏ పాత్ర చేసినా సినిమా వరకే. నీ లవర్ నిన్ను ప్రేమించడం లేదని అనుకోకు. ప్రేమ గట్టిదైతే ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. బలహీనమైపోతే, అలాంటి ప్రేమ నువ్వు కోరుకోకు. ప్రేమ జీవితం కాదు. నువ్వింకా చిన్నదానివి. ఎన్నో విజయాలు నీకోసం ఎదురుచూస్తున్నాయి. విజయగర్వంతో ముందుకు సాగిపో. మానవ జన్మ దేవుడిచ్చిన వరం. ఈ జన్మని సార్థకం చేసుకో. నువ్వు చావనవసరం లేకుండా పుట్టుకతో బాటు మరణాన్ని కూడా ప్రసాదించాడు ఆ దేవుడు. రెప్పపాటు ఈ జీవితాన్ని వృథా



చెయ్యకు. త్వరత్వరగా ఎదగడం నేర్చుకో. అదిగో, డైరక్టర్‌గారు వస్తున్నారు టచప్ చేయించుకొని షూటింగ్‌కి రెడీ అవుదాం రా!''

ఈసారి షూటింగ్‌లో విశాలి నటననీ డైరక్టరు గారితో సహా సెట్లోని అందరూ మెచ్చుకున్నారు. తరువాత ఇంకో రెండు చిత్రాల్లోనూ చెల్లెలి వేషాలే వచ్చాయి విశాలికి. మొదటి చిత్రంలో మోహన్ పక్కన హీరోయిన్‌గా వేసిన షకీలా మోహన్‌ని ప్రేమించసాగింది. ఎంత కాదనుకున్నా మోహన్ కూడా ఆమెని ప్రేమించడం చూస్తూ చూస్తూ సహించలేకపోయింది విశాలి. ఆమె మానసికంగా చాలా దెబ్బ తింది. అంతే గాక పుండు మీద కారం చల్లినట్లు 'చెల్లెలి కోసం' చిత్రంలో మోహన్‌కి చెల్లెలుగా వేసిన విశాలే రాఖీ పండగ రోజు మోహన్ చేతికి రాఖీ కట్టాల్సిన సీన్ షూట్ చేసారు. షూటింగ్ సరిగా చేయ్యలేదని డైరక్టర్ తిట్టాడు. మోహన్ కూడా తిట్టాడు.

''నువ్వెంత మనసు పాడు చేసుకున్నా నేనేం చెయ్యలేను విశాలీ! నిన్ను చూస్తుంటే నాకు నువ్వు సినిమాల్లో వేసిన చెల్లెలు పాత్రగా కాక, నిజంగా కూడా చెల్లెలి భావనే వస్తోంది. నేను షకీలాని ప్రేమిస్తున్నాను.'' అనేసరికి ఇంటికెళ్లాక ఏడ్చేసింది విశాలి.

తరువాత 'చెల్లెలి కోసం' చిత్రం క్లైమాక్సు సీను షూటింగవుతోంది. ఈ చిత్రం పూర్తయ్యాక తనో నిర్ణయానికి రావాలనుకుంది విశాలి. ఆరోజు సీను– 'చెల్లెలి కోసం' చిత్రంలో హీరో వాసుకి చెల్లెలయిన కల్పన అత్తవారింటో పెట్టే బాధపడలేక నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుంటుంది.

''చెల్లెమ్మా! ఎంత పని చేసావమ్మా? నీ బాధలు ఈ అన్నయ్యతో కూడా చెప్పుకోలేకపోయావా అమ్మా!'' అని చెల్లెలి మీద పడి ఏడుస్తాడు అన్నయ్య. చెల్లెల్ని ఎత్తుకుని అత్త మామల దగ్గరకెళ్లి దీనంగా ఏడుస్తాడు.

''చెప్పండయ్యా నా చెల్లెలేం తప్పు చేసిందో. మీ ఇంటికి కోడలిగా రావడమే ఆమె చేసిన తప్పా? మీ కూతురే ఇలా చేసుంటే మీకూ ఆ బాధేమిటో తెలిసేది. కట్నం గురించి నా చెల్లెల్ని చేసుకొని ఆమెని నానా బాధలు పెట్టి, మళ్లీ కట్నం కోసం మరో పెళ్లికి సిద్ధపడతారా? ఈ దేశంలో స్త్రీలకు మీరిచ్చే గౌరవం ఇదేనా?'' అంటూ విలపిస్తాడు.

ఈ లోగా పోలీసులొచ్చి వాళ్లని అరెస్టు చేసి తీసికెడతారు.

''ఈ సీన్ షూట్ చేసాక డైరక్టరు 'కట్.. కట్...' అన్నాడు.

''చాలా ఎక్సలెంట్‌గా చేశావమ్మా విశాలి ఇంక లే...''

విశాలి సూసైడ్ నిద్రమాత్రలు సీసా పట్టికెళ్లింది. షూట్ చేస్తున్నప్పుడు సీసాలో మాత్రలన్నీ మింగేసింది. అన్నగా చేసిన మోహన్ చెల్లెల్ని చేతుల్లోంచి కిందకు దింపాడు. షూటింగ్ అయిపోయింది. డైరెక్టర్ కట్ చెప్పినా ఇంకా లేవలేదు విశాలి. అచేతనంగా పడుంది. కంగారు పడి హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. ఐసియూలో పెట్టారు. రెండు గంటలయ్యాక మరే ప్రమాదం లేదు. ఆమెకేం కాలేదు. మరీ ఎమోషనల్‌గా చేసిందంతే అన్నారు డాక్టర్లు. డైరక్టర్ వర్మ, నిర్మాత పట్టాభి, హీరో మోహన్, అందరూ లోపలకెళ్లి పరామార్శించారు.

''ఏంటమ్మా, మరీ అలా జీవించేసావు? నీతో బలే చిక్కొచ్చి పడిందే! ఎవరన్నా కనబడితే షూటింగ్ మధ్యలో వాళ్లమీద అభిమానంతో ప్రేమ కురిపించేస్తావు. బాగా నటించవమ్మా అంటే, ఇలా జీవించేస్తావు. మేం ఎంత కంగారు పడ్డామో తెలుసా?''

విశాలికంతా అయోమయంగా వుంది. తనెలా బ్రతికింది? తను నిద్రమాత్రల సీసా కొనుక్కుని తెచ్చుకుంది. ఆ సీన్‌లో నిద్రమాత్రలు మింగి చనిపోవాలనుకుంది. కానీ బ్రతికిపోయింది. ఎలా జరిగిందో? మనుషుల మనసుల లాగే నిద్రమాత్రలు కూడా కల్తీ అవుతున్నాయా? అరే భగవంతుడా! చావనీయకుండా బతికించేసావు. మళ్లీ ఈ భారమైన బతుకు ఎలా బతకాలిరా నాయనా! అని మెల్లగా అనుకుంది.

ఈ చిత్రంలో అత్తగా వేసిన రాగసుధ, ''నువ్వు వేసుకున్నది నిద్రమాత్రలు కావమ్మా. విటమిన్ టాబ్లెట్లు. నువ్వు తెచ్చుకున్న నిద్రమాత్రల సీసా తీసేసి, విటమిన్ టాబ్లెట్లు పెట్టాను. నేనెంత చెప్పినా నీ మనసు ఆందోళన పడుతోందని, ఓ కంట గమనిస్తూనే వున్నాను. అందుకే ఆ మాత్రలు తీసేసి, విటమిన్ టాబ్లెట్లు పెట్టాను. చూసావా విశాలీ! విధి ఎంత చిత్రమైనదో? నీ మొదటి చిత్రంలో నీకు తల్లిగా వేసాను. తల్లిలా నీకు హితబోధ చేసాను. నువ్వు వినిపించుకోలేదు. ఈ చిత్రంలో దుర్మార్గురాలైన అత్తగా వేసినా, నీ ప్రవృత్తి గమనిస్తూ, నువ్వేం అఘాయిత్యం చేసుకుంటావో అని భయపడుతూ నీన్నో కంట కనిపెడుతూనే వున్నాను. నీ నటన ఎంత మెచ్చుకుంటున్నారో తెలుసా? అవునమ్మా... నా తరువాతి చిత్రం 'నీ నవ్వే ప్రాణం' చిత్రంలో నువ్వే హీరోయిన్‌వి. హీరో ఎవరనుకుంటున్నావు? నీవు ప్రేమించే వ్యక్తి మోహన్. రావయ్యా, మోహన్! వచ్చి శుభం కార్డు వెయ్యి.

''సారీ విశాలీ! నిన్ను అనుకోకుండా బాధ పెట్టాను. నన్ను క్షమించు. షకీలాది నిజమైన ప్రేమ కాదని తెలుసుకున్నాను. నేను నిన్నే ప్రేమిస్తున్నాను. నిన్నే పెళ్లి చేసుకుంటాను.

విశాలీ అంది ''వద్దు మోహన్! నా మీద నీకున్న చెల్లెలి అభిప్రాయం మార్చుకోకు. షకీలాది నిజమైన ప్రేమ కాదని, చెల్లెలి అభిప్రాయం తుడిచేసి, నన్ను పెళ్లిచేసుకోకు. నాకు చాలా కంపరంగా వుంటుంది. నాకు అన్న లేని లోటు తీర్చావనుకున్నా. త్వరత్వరగా అభిప్రాయాలు మార్చేసుకుని, అన్న అనే పదానికి కళంకం రానీయ్యకు. నీ మీద నాకు సోదర ప్రేమ తప్ప ఏ ప్రేమా లేదు. ఇదిగో రాఖీ కట్టించుకో!'' అంటూ మోహన్ చేతికి రాఖీ కట్టింది విశాలి.

*



## ప్రేమలో సంగీత

సినీతార సంగీత ఇప్పుడు ప్రేమలో ఉంది. ఇలా అని స్వయానా ఆమే చెప్పుకుంటోంది. ఆమె ప్రియుడు సినీ ప్రపంచానికి చెందినవాడు కాదు. అయితే పెళ్ళికి మాత్రం కొన్ని అడ్డంకులు ఉన్నట్టు తెలుస్తోంది. సంగీత తల్లిదండ్రులకు ఈ ప్రేమ పట్ల అభ్యంతరం లేనప్పటికీ, ఆ అబ్బాయి కుటుంబం తరపున మాత్రం అతను సినిమా పిల్లను చేసుకోవడం ఇష్టం లేదట. వాళ్ళ సమ్మతి కోసం ప్రయత్నిస్తున్నామని, వాళ్ళ సమ్మతి కూడా లభించాకనే పెళ్ళి జరుగుతుందని చెప్తోంది సంగీత. సంగీత పెళ్ళి కబురు ఆమె సినీ అవకాశాల్ని దెబ్బతీసింది. తెలుగులో అవకాశాలు తగ్గినా తమిళంలో నిన్నమొన్నటి వరకూ చేతి నిండుగా పని ఉంది. 'నాయగన్', 'ధనం' లాంటి వరుస హిట్లతో నిజానికి ఆమె కెరీర్ ఊపందుకోవాలి. కానీ పెళ్ళంటూ మధ్యలో ఆమె మానేస్తే తమ పని దిక్కుతోచకుండా అయిపోతుందని నిర్మాతలు ఆమెను ఎంచుకోవడానికి సంశయిస్తున్నారట.